

క్రేజ్ లేని 'పీజీ'

పోస్టు గ్రాడ్యుయేషన్‌పై విద్యార్థులు నిరాసక్తత చూపుతున్నారు. ఈ క్రమంలోనే గత ఏడాది కంటే దరఖాస్తులు తగ్గిపోయాయి. - 8లో



గరుడునిపై నృసింహుని విహారం

పెంచలకోనలోని పెనుశిల శ్రీలక్ష్మీనృసింహస్వామివారు ఆదివారం గరుడ వాహనంపై మాడవీధుల్లో విహరించారు. - 8లో



23న ఒలింపిక్ రన్

జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన తిరుపతిలో ఒలింపిక్ రన్ నిర్వహించనున్నారు. - 8లో

అధికారం కోసం ఏమైనా చేసేస్తాం..ఓట్ల కోసం అలవోకగా అబద్ధాలు చెప్పేస్తాం.. ఏరు దాటాక తెప్పను నిలువునా తగలేస్తాం.. పదవి కోసం ఎవరినైనా మోసం చేస్తాం.. ఇదే మా నైజం.. అని ఘనత వహించిన చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో నోటికొచ్చిన హామీలు గుప్పించారు. పీఠం ఎక్కిన తర్వాత ఇచ్చిన మాటలను తుంగలో తొక్కేశారు. వారు.. వీరు అనే తేడా లేకుండా అన్నివర్గాలను వంచించారు. అందులో భాగంగా కష్టపడి చదువుకుని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు శఠగోపం పెట్టేశారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని బురిడీ కొట్టించారు. నిరుద్యోగ భృతి ఇస్తామని కబుర్లు వల్లించి వెన్నుపోటు పొడిచేశారు.

యువతకు వెన్నుపోటు



భృతి, జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు

నియోజకవర్గం	ఎస్ఎస్‌సీ, ఇంటర్	ఐటీఐ,డిప్లొమా	యూజీ	పీజీ, ఆపైన
తిరుపతి	92,210	26,560	56,102	22,940
చంద్రగిరి	77,357	35,865	45,776	16,887
శ్రీకాళహస్తి	65,720	38,150	41,805	14,125
వెంకటగిరి	45,771	25,900	38,007	10,750
సూళ్లూరుపేట	51,325	17,550	35,650	9,255
గూడూరు	44,867	12,763	40,127	11,558
సత్యవేడు	50,122	13,407	31,252	10,657

ఏడాదిగా నిరుద్యోగులకు చెల్లించాల్సిన భృతి

నియోజకవర్గం	లబ్ధిదారులు	చెల్లించాల్సిన మొత్తం (రూ.కోట్లలో)
తిరుపతి	1,97,812	82.60
చంద్రగిరి	1,77,885	60.80
శ్రీకాళహస్తి	1,59,800	50.86
వెంకటగిరి	1,20,428	43.35
సూళ్లూరు పేట	1,13,780	40.96
గూడూరు	1,09,315	41.61
సత్యవేడు	1,05,438	38.37

ఏడాదిగా తొలగించిన ఉద్యోగుల వివరాలు

తాత్కాలిక ఉద్యోగులు	13,498
విద్యా వైద్య రంగంలో	15,350
ఔట్‌సోర్సింగ్	10,125
ఎమ్‌డీయూ ఆపరేటర్లు	369
వైన్‌షాప్ సిబ్బంది	856
వలంటీర్లు	11,938

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం గారడీ

- పీఠం ఎక్కిన తర్వాత బురిడీ
- యువతీయువకులను మోసం చేసిన చంద్రబాబు
- ఏటా 4లక్షల ఉద్యోగాలు.. జాబ్ క్యాలెండర్ అంటూ వంచన
- నిరుద్యోగ భృతి పేరిట శఠగోపం
- అయోమయంలో ఆప్కాస్ సిబ్బంది భవితవ్యం
- రద్దు చేసే దిశంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం
- కలగానే ఒకటో తేదీన వేతనం
- కూటమి సర్కార్ వైఖరిపై మండిపడుతున్న జనం
- గత వైఎస్సార్‌సీపీ హయాంలో 2.25 లక్షల మందికి ఉద్యోగావకాశం
- జగనన్న పాలనలో ఉపాధి కల్పనే లక్ష్యం

తిరుపతి సిటీ : యువతకు ఏడాదికి 4లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. అధికారం చేపట్టిన తొలి ఏడాది నుంచి జనవరి ఒకటో తారీఖున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేల భృతి అందిస్తాం. పారిశ్రామిక రంగాన్ని కొత్తపుంతలు తొక్కించి యువతకు ఉపాధి కల్పించి తీరుతాం అంటూ సార్వత్రిక ఎన్నికలలో చంద్రబాబు అండ్ కో ప్రగల్భాలు పలికారు. యువతను మభ్యపెట్టి ఓట్లు దండుకున్నారు. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్న ఒక్క ఉద్యోగం లేదు. జాబ్ క్యాలెండర్ ఊసేలేదు. నిరుద్యోగ భృతి ఇవ్వలేమంటూ చేతులెత్తేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా యూటర్న్ తీసుకున్న కూటమి సర్కార్‌ను చూసి మోస పోయామంటూ యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. అలాగే ఉద్యోగాల కల్పన మాట దేవుడెరుగు ఉన్నవాటిని తొలగించి చిరుద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నారు. ఆప్కాస్‌ను పూర్తిగా రద్దు చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

భృతి అంతా భ్రాంతి

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో యువతకు చేసింది శూన్యం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలలో కలిపి ఖాళీగా ఉన్న సుమారు 98వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామన్న హామీ తుంగలో తొక్కేసింది. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతకు అదే ఏడాదిలో ఉద్యోగం కల్పించేందుకు పారిశ్రామికాభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని గాలికి వదిలేసింది. నిరుద్యోగ భృతి కోసం పడిగాపులు కాస్తున్న యువతకు చివరకు భ్రాంతినే మిగిల్చింది. సూపర్ సిక్స్ పేరుతో చేసిన వంచననే మళ్లీ యువత విషయంలో పునరావృతం చేసింది.

వేతన జీవుల వెతలు

ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తారీఖున వేతనాలు జమ చేస్తామని బాబు చెప్పిన మాటలు నమ్మి వేతన జీవులు మోస పోయారు. జిల్లాలో సుమారు 85వేల మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు సకాలంలో జీతం అందక ప్రతి నెలా నరకం అనుభవిస్తున్నారు. ఏడాదిగా ఏనాడూ ఒకటో తేదీన జీతం జమకాకపోవడంతో ఈఎంఐలు, లోన్లు, వడ్డీలు, నిత్యావసర సరుకులకు నానా అవస్థలు పడుతున్నారు. అప్పులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

గాలం వేసి..నామం

ఎన్నికలలో యువతకు గాలం వేసి ఓట్లు దండుకునేందుకు యువగళం పేరుతో పాదయాత్ర ప్రారంభించిన లోకేష్ ఊరు వాడా తిరుగుతూ అబద్ధపు మాటలతో ముఖాముఖి పేరుతో సభలు నిర్వహించారు. ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేస్తాం. ప్రభుత్వ ఉద్యోగాలను ఏటా భర్తీ చేస్తాం. ఏడాదికి 4లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి తీరుతాం. నిరుద్యోగ భృతిని అందిస్తామని ఊదరగొట్టారు. అధికారం చేపట్టి విద్యాశాఖ మంత్రిగా తనకు మాత్రమే ఉపాధి కల్పించుకుని నిరుద్యోగులకు శఠగోపం పెట్టేశారు. 2024 జూన్ నుంచి ఏడాదిగా ఒక్క ఉద్యోగాన్ని భర్తీ చేయలేని అసమర్థ ప్రభుత్వంగా పేరుపొందింది.

ఆప్కాస్ రద్దు దిశగా అడుగులు

జిల్లాలో తాత్కాలిక ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. కూటమి ప్రభుత్వం ఏడాదిగా ఆప్కాస్ ఉద్యోగులపై కక్ష పెంచుకుంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 15వేల మందిని తొలగించింది. అంతటితో ఆగకుండా జగనన్న పాలనలో ఏర్పాటు చేసిన ఆప్కాస్‌నే పూర్తిగా రద్దు చేసేందుకు అడుగులు వేస్తోంది. దీంతో జిల్లాలో సుమారు 30వేల మంది తాత్కాలిక ఉద్యోగులు వీధిన పడనున్నారు. ప్రస్తుతం ఉన్న తాత్కాలిక ఉద్యోగులకు టైం స్కేల్ అందిస్తూ పీఎఫ్‌ను వర్తింపజేస్తామని హామీ చెప్పిన కూటమి సర్కార్ చేతులెత్తేసింది. జీతభత్యాలు సైతం సక్రమంగా అందిచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. త్వరలో ఆప్కాస్‌ను రద్దు చేసేందుకు పావులు కదుపుతోంది. దీంతో ఆప్కాస్ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో స్వర్ణయుగం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పని చేసింది. అర్హులైన వారికి ప్రత్యేక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లను ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించింది. ఈ క్రమంలో వేలాది మంది ఉన్నత స్థాయి ఉద్యోగాలు దక్కించుకున్నారు. అలాగే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన 3 నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 2.25లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారు. అన్ని శాఖలలోనూ పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగులను ఆప్కాస్ కిందకి తెస్తూ ఉద్యోగ భద్రత కల్పించారు. ఔత్సాహిక యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో పెద్ద సంఖ్యలో జాబ్ మేళాలు నిర్వహించి తొలి ఏడాదిలోనే సుమారు 1.24లక్షల ఉద్యోగాలను యువతకు అందించారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన ఉద్యోగాలు

సచివాలయ సిబ్బంది	5,010
వలంటీర్లు	11,938
ఎండీయూ ఆపరేటర్లు	369
వైన్‌షాప్ సిబ్బంది	856
విద్యా, వైద్య రంగాల్లో	8,752
ప్రభుత్వ శాఖలలో(శాశ్వత, తాత్కాలిక)	10,257
జాబ్ మేళాల్లో ఉద్యోగాలు పొందిన వారు	33,740

బకాయితో పాటు చెల్లించాలి



యువగళంలో లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు నెలకు రూ.3వేల భృతి చెల్లించాలి. గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదు. ఇప్పటి వరకు 12నెలలకు గాను ఒక్కో నిరుద్యోగికి రూ. 36వేలు చెల్లించాల్సి ఉంది. ఏడాదికి 4లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని యువతకు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. తూతూ మంత్రంగా మెగా డీఎస్సీ అంటూ హంగామా చేస్తున్నారు. – రవిశంకర్‌రెడ్డి, ఎంటీఏ, తిరుపతి

జాబ్ క్యాలెండర్ ఊసే లేదు



ఎన్నికల హామీలలో భాగంగా కూటమి నేతలు యువతను ఆకట్టుకుంటూ పథకాలను అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టారు. కానీ సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు. కనీసం యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రతి ఏడాది జనవరి ఒకటో తారీఖున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. ఆ ఊసే ఎత్తడం లేదు. యువతను కూటమి సర్కార్ వంచించింది. వైఎస్సార్‌సీపీ పాలనలో తొలి ఏడాదిలోనే 2.25లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశారు. అందులో మా అక్కకు సైతం ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా ఉంది.
– సుకన్య, ప్రైవేటు ఉద్యోగి, తిరుపతి రూరల్

ఉద్యోగాలు ఎక్కడ?



తమను గెలిపిస్తే ఏడాదికి 4 లక్షలు ఉద్యోగాల చొప్పున ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చంద్రబాబు యువతను నమ్మించాడు. ఈ ఏడాది కాలంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం కూడా ఇచ్చిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువతను దృష్టిలో ఉంచుకొని 6.47 లక్షల ఉద్యోగాలు ఇస్తే అందులో 2.25 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వంలో ఉన్నవాటిని తీసేస్తున్నారు. ఉద్యోగులకు భద్రత కరువైంది. ఉద్యోగం ఇచ్చే వరకు రూ.3వేల భృతి ఇస్తామన్న బాబు 12 నెలలు గడిచినా ఆ మాటే మరిచారు.
– కదిరి రాజేంద్ర, తిరుపతి

ఇది దగా ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం బాధాకరం. యువతకు జాబ్ క్యాలెండర్ లేదు. నిరుద్యోగ భృతి లేదు. సుమారు లక్ష మంది పని చేస్తున్న ఆప్కాస్‌ను ఎత్తేస్తున్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడడం దారుణమైన విషయం. కూటమి ప్రభుత్వం కాదు ఇది యువత పాలిట దగా ప్రభుత్వం. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలి.
– పి.శరత్‌చంద్ర, మణిపిరెడ్డిపల్లె, పాకాల మండలం

కక్ష గట్టింది



కూటమి ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగులపై కక్ష గట్టింది. వేధింపులకు పాల్పడుతూ తొలగించే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం ఇలా చిరుద్యోగులపై కత్తిగట్టడం దారుణం. టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తిస్తూ పీఎఫ్ సైతం వర్తింపజేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఇప్పుడు పూర్తిగా రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేస్తే ప్రతిఘటిస్తాం. పోరు బాట పట్టి సర్కారు మెడలు వంచుతాం. – జి.చిన్న బాబు, ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు

చిరుద్యోగులపై ప్రతాపమా?



గత 25ఏళ్లుగా ప్రభుత్వ సంస్థలలో చాకిరీ చేస్తున్న చిరుద్యోగులపై కూటమి ప్రభుత్వం ప్రతాపం చూపడం సరికాదు. ఆప్కాస్‌ను తొలగిస్తామనడం దారుణం. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తాత్కాలిక ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేందుకు కృషి చేస్తుందని భావించాం. ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఊహించలేదు. టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించకపోతే ఉద్యమిస్తాం. – పి.బాబు, జేఏసీ జిల్లా వైస్ ప్రెసిడెంట్

న్యూస్‌రీల్

నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీజీసెట్–2025 పరీక్ష ఉమ్మడి జిల్లాలోని వేము ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం జరగనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు సెషన్లలో జరగనున్న ఈ పరీక్షకు తొలి రోజు 366 మంది హాజరవుతారని చెప్పారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి కంటే అర్ధగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. పీజీ సెట్ పరీక్షలు ఈనెల 12వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 88,257 మంది స్వామివారిని దర్శించుకోగా 45,068 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.68 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందని, ప్రతి అధికారి హాజరు కావాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌తోపాటు మండల, డివిజన్ స్థాయిల్లోనూ గ్రీవెన్స్ ఉంటుందని పేర్కొన్నారు. నమోదు చేసుకున్న అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 కాల్ చేస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని తెలిపారు.

ఎంసెట్ ఫలితాల్లో మెరుపులు


తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు మే 19 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ ఈఏపీ (ఎంసెట్) ఫలితాలు ఆదివారం విడుదల చేశారు. ఇందులో జిల్లా విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభను చాటారు. ఇంజినీరింగ్ విభాగంలో తిరుపతికి చెందిన మాండవ్యపురం భానుచరణ్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించారు. అలాగే ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగాల్లో మణిదీప్‌రెడ్డి 7వ ర్యాంకు, ఓ.ఆరుష్ లక్ష్మణ్ 45వ ర్యాంకు, ధనుష్ 59, యశ్విత 69, మౌనిక 94, వి.యశ్వంత్ 135, డి.లావణ్య 230, లక్ష్మీసహస్ర 322, ఎ.జెస్విత 398, కె.జస్విత 444, వై.శివకృతిక్ 492, హర్షవర్ధన్ 528, ఎం.ఉమేష్ 551, ఎం.హిమవర్ష 787, సి.రామలక్ష్మమ్మ 799, వి.లక్ష్మీహర్షిత 800, కె.మంజునాథ మహర్షి 900, కె.టీనారాణి 919, వి.సాధన 925వ ర్యాంకులు దక్కించకుని సత్తా చాటారు.

ఏఐ రంగంలో రాణించాలి



ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకును మాండవ్యపురం భానుచరణ్‌రెడ్డి సాధించారు. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.జయభారత్‌రెడ్డి, ఎం.సురేఖ దంపతుల కుమారుడైన భానుచరణ్‌రెడ్డి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) రంగంలో రాణించడమే తన లాంగ్ టర్మ్ గోల్ అని తెలిపారు. అందులో భాగంగా ప్రస్తుతం ఐఐటీ బాంబేలో సీటు పొంది సీఎస్ఈ చదవడమే తన లక్ష్యమని వెల్లడించారు.
– మాండవ్యపురం భానుచరణ్‌రెడ్డి, తిరుపతి

సుందరం..సుమనోహరం



తిరుచానూరు పద్మావతీదేవి వార్షిక తెప్పోత్సవాలు శోభాయమానంగా సాగుతున్నాయి. అందులో భాగంగా రెండో రోజు ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీసుందరరాజస్వామివారు పద్మసరస్సులో తెప్పలపై విహరించారు. ఉభయదేవేరులతో కలిసి పుష్కరిణిలో మూడు ప్రదక్షిణలు చేశారు. కనులపండువగా ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లను పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారు తిరుచ్చిపై కొలువుదీరి మాడవీధుల్లో విహరించారు. – చంద్రగిరి

క్లుప్తంగా

నకిలీ పత్రాలతో ఆస్తులు అమ్మేసిన వ్యక్తి అరెస్ట్



మునిరత్నంరెడ్డి

తిరుపతి రూరల్: నకిలీ పత్రాలు సృష్టించి విలువైన ఆస్తులు కాజేసి ఇతరులకు అమ్మేసిన వ్యక్తిని తిరుపతి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. సీఐ చిన్న గోవింద కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండల పరిధిలోని శ్రీనివాస హౌసింగ్ సొసైటీలో శారద అనే మహిళకు చెందిన ఆస్తిని చంద్రగిరి మండలం గంగుడుపల్లెకు చెందిన మునిరత్నం రెడ్డి మరో ఇద్దరితో కలిసి రూ.86 లక్షలకు విక్రయించాడు.అలాగే వేదిక్ అపార్ట్‌మెంట్‌లో ఒకసారి అమ్మిన స్థలాన్ని మరొకరికి కట్టబెట్టి అక్రమంగా సొమ్ము చేసుకున్నాడు. రాజకుమారి అనే మహిళకు సంబంధించిన ఆస్తిని తన భార్యపై రిజిస్టర్ చేసుకుని వేరొకరికి అమ్మేశాడు. ఇలా ఎంతో మంది భూములకు నకిలీ పత్రాలతో విక్రయించినట్లు పోలీసులకు వరుస ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసిన పోలీసులు మునిరత్నం రెడ్డిని ఆదివారం మల్లవరం క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న నిందితుడి నుంచి పలు డాక్యుమెంట్లు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

ఘాట్ రోడ్‌లో ప్రమాదం

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్‌లో ఆదివారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు స్వల్పంగా గాయపడిన ఘటన వెలుగు చూసింది. తమిళనాడుకు చెందిన భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని వాహనంలో తిరిగి వెళ్తుండగా నాలుగో మలుపు వద్ద డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేక డివైడర్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఇద్దరు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని తిరుమలలోని అశ్విని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన వాహనాన్ని టీటీడీ ట్రాఫిక్ పోలీసులు సకాలంలో పక్కకు తొలగించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

అయ్యోర్ల ఆగ్రహం

- ఉద్యమించిన ఉపాధ్యాయులు
- వెబ్ ఆప్షన్ విధానం రద్దు చేయాలంటూ ధర్నా
- రోడ్డుపై బైఠాయించి నిరసన
- మోకాళ్ల పై కూర్చొని నినాదాలు
- బారికేడ్లు పెట్టి మోహరించిన పోలీసులు



డీఈఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయ ఐక్యవేదిక సంఘాల నాయకుల నిరసన



తలకిందులుగా టీచర్ నిరసన

చిత్తూరు కార్పొరేషన్: తమ సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు ఉద్యమించారు. బదిలీ కౌన్సెలింగ్ జరుగుతున్న లోటుపాట్లను సరిదిద్దాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడంపై మండిపడ్డారు. డీఈఓ కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులు ఆదివారం ఉదయం జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్దకు తరలివచ్చారు. వారిని నిలువరించేందుకు పోలీసులు భారీగా మోహరించారు. వారిని కార్యాలయంలోకి పంపకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో అయ్యోర్లు రోడ్డు పై బైఠాయించారు. మండు టెండలో మోకాళ్ల పై నిల్చొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఓ ఉపాధ్యాయుడు తల కిందులుగా నిరసన తెలిపాడు. వెబ్ కౌన్సెలింగ్ విధానం రద్దు చేయాలని నినదించారు. కాని పక్షంలో సోమవారం నుంచి నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

రీ కౌన్సెలింగ్ జరిపి న్యాయం చేయాలి

ఉపాధ్యాయుల బదిలీకి సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ వద్దని మాన్యువల్ కౌన్సెలింగ్ కావాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. వెబ్ ఆప్షన్‌లో వచ్చిన లోపాలను సవరించాలని నినాదాలు చేశారు. నష్టపోయిన ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక రీ కౌన్సెలింగ్ జరిపి న్యాయం చేయాలని కోరారు. 20 రోజుల ముందు జరిగిన చర్చల్లో మాన్యువల్ కౌన్సెలింగ్‌కు విద్యాశాఖ అంగీకరం తెలిపిందన్నారు. కానీ మళ్లీ వెబ్ ఆప్షన్ పెట్టుకోవాలని కోరడం ఏమిటన్నారు. దీంతో ఎస్జీటీలు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. ప్రధానంగా సీనియర్లకు అన్యాయం జరుగుతోందని అంతా గందరగోళంగా మారిందన్నారు. ఈ విధానం వల ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారు తీవ్రంగా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు.

టీచర్ల డిమాండ్లు ఇవీ..

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి. క్లస్టర్ లెవల్ అకడమిక్ టీచర్ ఖాళీలతో కలిపి ముందుగా ఇచ్చిన ఆప్షన్ మేరకు బదిలీ ఉత్తర్వులు విడుదల చేయాలి. రిక్వెస్ట్ బదిలీ దరఖాస్తు చేసుకున్నప్పటికీ బదిలీల వెబ్ సైట్‌లో తప్పనిసరిగా బదిలీగా చూపడం సరికాదు. ఫైనల్ సీనియర్ జాబితా విడుదల చేయకుండా ఉపాధ్యాయుల గ్రీవెన్స్ పరిష్కారం కాకుండానే ఆప్షన్ పెట్టుకోవాలని ఒత్తిడి చేయడం అన్యాయం. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న ఖాళీలను కేటాయించకపోవడంతో తర్వాత సదరు ఖాళీలను పదోన్నతుల్లో చూపడం వల్ల సీనియర్ ఉపాధ్యాయులు నష్టపోతున్నారు. కొన్ని ఖాళీలను సీనియర్ ఉపాధ్యాయులు ముందుగా బదిలీ కోసం ఎంపిక చేసుకున్నప్పటికీ వారికి కేటాయించకుండా జూనియర్లకు ఇస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకే పోస్టును ఇద్దరికి కేటాయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రెడ్డప్పనాయుడు, మణికంఠన్, చెంగల్రాయమందడి, మోహన్, ముత్యాలరెడ్డి, శేఖర్, సోమశేఖర్‌నాయుడు, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రి స్పందించాలి



విద్యాశాఖమంత్రి నారా లోకేష్ మా సమస్యల పై స్పందించాలి. ఉమ్మడి జిల్లాలో 3,253 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. డిమాండ్ల పరిష్కారం కోసం అయ్యోర్లు రోడ్డు ఎక్కారు. అయిన ఇంత వరకు ఒక ప్రకటన లేదు. జిల్లావాసి చంద్రబాబుకు మా సమస్యలు పట్టడం లేదు.

– మదన్ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్టీయూ

సీనియర్లు నష్టపోతున్నారు



సీనియర్లు జూనియర్లుగా, జూనియర్లు సీనియర్లుగా బదిలీ ప్రక్రియ విధానం జరుగుతోంది. సీనియార్టీకి విలువ లేకుండా పోతోంది. గందరగోళ పరిస్థితి నెలకొనడంతో ఉపాధ్యాయులు అయోమయంగా ఉన్నారు. డీఏ, పీఆర్సీ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.

– దీనవతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, యూటీఎఫ్

మాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలి



గతంలో జరిగిన చర్చల్లో ఎస్జీటీలకు మ్యానువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి తెలిపారు. ఇప్పుడు అలా జరగడం లేదు . ఇచ్చిన మాటను తప్పారు. మ్యానువల్ కౌన్సెలింగ్‌ను తుంగలో తొక్కి వెబ్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపడుతున్నారు. ఇదిసరైన పద్ధతి కాదు.

– రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్

దౌర్జన్యంగా బదిలీలు



అసంబద్ధంగా జరుగుతున్న బదిలీల ప్రక్రియ పై భవిష్యత్తు ప్రభుత్వానికి గుణపాఠం చెబుతాం. వీటిపై ఫిర్యాదు చేయడానికి గ్రీవెన్స్ ఏర్పాటు చేయలేదు. సీనియార్టీ ప్రకారం వివరాలు అందుబాటులో లేవు. దౌర్జన్యంగా బదిలీల ప్రక్రియ చేస్తున్నారు.

– కన్నన్,జిల్లా అధ్యక్షుడు పీఆర్టీయూ

పరిష్కార మార్గం చూపాలి



గతంలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ సజావుగా సాగింది. అప్పుడు మా సమస్యలను విని వాటిని పరిష్కరించారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. అంతా అసంపూర్తిగా ఉంది. ఉపాధ్యాయులు అయోమయంలో ఉన్నారు. ఇకనైన వీటికి పరిష్కార మార్గం చూపాల్సి ఉంది. లేకపోతే భవిష్యత్తులో నష్టం తప్పదు.

– బాలాజీ, రాష్ట్ర అధ్యక్షుడు, ఆపస్

డీఎస్సీ పరీక్షకు 157 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా నిర్వహించిన డీఎస్సీ పరీక్షకు మొత్తం 157 మంది గైర్హాజరైనట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. ఉదయం సెషన్‌కు 624 మందికి గాను 601, మధ్యాహ్నం సెషన్‌కు 1,272 మందికి గాను 1,138 మంది హాజరైనట్లు వెల్లడించారు.

కారు ఢీకొని జింక మృతి



జింక కళేబరం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం కోటూరిపల్లె సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం కారు ఢీకొని జింక మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన కారును వెంబడించినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రేణిగుంట : కరకంబాడి–మంగళం రహదారిలో శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడి తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. వివరాలు.. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 55 ఏళ్ల వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు 108లో రుయాకు తరలించగా చికిత్సపొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలియలేదని, ఆచూకీ తెలిసిన వారు రేణిగుంట పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పేరూరులో రూ.20 కోట్ల భూమి కబ్జా



ఆక్రమిత భూమిలో నిర్మాణ పనులు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పేరూరు గ్రామ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 529లోని ఎకరా భూమి ఆక్రమణకు గురైంది. తిరుపతి– చంద్రగిరి మార్గంలోని స్టాఫ్ క్వార్టర్స్ వద్ద రోడ్డు పక్కనే ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుతం మార్కెట్‌లో రూ.20 కోట్ల వరకు ఉంది. దీనిపై రెండు నెలల క్రితమే సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో ఆక్రమణదారులు కొంతకాలం పనులు నిలుపుదల చేశారు. ఆదివారం మళ్లీ ఆక్రమిత భూమిలో గుట్టుచప్పుడు కాకుండా నిర్మాణ పనులు ప్రారంభించారు. అదే భూమిపై కోర్టును ఆశ్రయించిన ఓ మహిళ అక్కడకు వెళ్లి పనులు అడ్డుకునేందుకు విఫలయత్నం చేసింది. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. టీడీపీకి చెందిన ఓ ముఖ్యనేత ఒత్తిడి కారణంగానే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

నలుగురు ఎర్రదొంగల అరెస్ట్



దుంగలతోపాటు స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె అటవీప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న 48 ఎర్రచందనం దుంగలతో పాటు ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, నలుగురు స్మగ్లర్లను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ జి. బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధరరెడ్డి టీమ్ శనివారం అన్నమయ్య జిల్లా బురకాయల కోట అటవీ ప్రాంతం చేరుకుంది. స్థానిక అటవీ అధికారులు జయప్రసాదరావు, మోహన్ రెడ్డి, షబీన్ తాజ్ ల సహకారంతో వేపూరి కోట ఫారెస్ట్ బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టింది. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున వీరుఅన్నగారిపల్లె సమీపంలోని వంకగట్టు వద్ద ఎర్రదొంగలు కనిపించారు. పారిపోయేందుకు యత్నించగా వెంబడించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిని అన్నమయ్య జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. నిందితులతో పాటు ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్‌ను తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యవేడులో ‘ఐవీఆర్ఎస్’ అలజడి

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో ఈ నెల 4వ తేదీ నుంచి సాగుతున్న ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్ సర్వే సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. సర్వేలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే పనితీరుతోపాటు కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు.కూటమి పాలన బాగుంటే 2 నొక్కండి అనే ఆప్షన్‌ను ఐవీఆర్ఎస్‌లో వినిపిస్తున్నారు. అలాగే నియోజకవర్గంలోని 7 మండలాల పార్టీ అధ్యక్షుల వైఖరి, వారి మార్పులపై సైతం కార్యకర్తల నుంచి సమాచారం సేకరిస్తున్నారు. దీంతో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ నేతల్లో గుబులు మొదలైంది. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంలో అప్పుడే సర్వేలకు శ్రీకారం చుట్టడంపై ఆందోళన చెందుతున్నారు.

వెలుగులోకి ఇన్‌చార్జి నియామకం

ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే నిర్వహిస్తుండడంతో మళ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి నియామకం విషయం వెలుగులోకి వస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఇప్పటికే ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో 8నెలలకు పైగా సస్పెన్షన్‌లో కొనసాగుతున్నారు. ఇటీవల మంత్రి లోకేష్ నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సమయంలో సైతం ఆయనను పక్కన పెట్టారు. అయితే తాజాగా జరుగుతున్న ఐవీఆర్ఎస్ సర్వేలో మరో మారు ఎమ్మెల్యే ఆదిమూలం పనితీరు గురించి ఆరా తీస్తున్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పనితీరు బాగుంటే సస్పెన్షన్‌ను ఎత్తివేసి పూర్తిస్థాయి బాధ్యతలు ఎమ్మెల్యేకు అప్పగించే అవకాశాలు ఉన్నాయంటూ ఆయన వర్గీయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఈ సర్వే ఆంతర్యమేంటి, అసలు సర్వేకు కారణాలు ఏంటి, దీని వెనుక ఎవరు ఉన్నారన్న దానిపై కూడా నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది.

పార్టీ మండల అధ్యక్షుల్లో వణుకు

ఐవీఆర్ఎస్ సర్వేలో టీడీపీ మండల అధ్యక్షుల పనితీరుపై సైతం ఆరా తీస్తున్నారు. దీనిపై సదరు అధ్యక్షులు, పార్టీ శ్రేణుల్లో అలజడి నెలకొంది. కొందరు సామాజిక మాధ్యమాల్లో సైతం మా మండల అధ్యక్షుడి పనితీరు బాగుంది, ఆయనను మార్పు చేసే ప్రసక్తే లేదు. ఆయనకు పార్టీ అధిష్టానం అండదండలు మెండుగా ఉన్నాయంటూ అనుచరులు ప్రకటనలు ఇస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహానాడుకు ముందే మండల కమిటీలు, గ్రామ కమిటీలు ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. అయితే సత్యవేడు నియోజకవర్గంలో మాత్రం కమిటీల నియామకం ఇప్పటి వరకు పూర్తికాలేదు. కమిటీల ప్రక్రియ పూర్తి చేయమని మంత్రి లోకేష్ పర్యటనలో నియోజకవర్గ పరిశీలకుడిగా చెలామణి అవుతున్న చంద్రశేఖర్ నాయుడు,కో–ఆర్డినేటర్ శ్రీపతిబాబుకు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆ ప్రక్రియ ఇప్పటివరకు పూర్తికాలేదు. అయితే ఐవీఆర్ఎస్‌లో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణతో కమిటీల ప్రక్రియ ప్రారంభం ఇక మొదలవుతుందని టీడీపీ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. ఏదిఏమైనా ఐవీఆర్ఎస్ సర్వే నియోజకవర్గంలో రాజకీయ అలజడి రేపుతోంది.

గరుడునిపై నృసింహుని విహారం



విశేషాలంకరణలో స్వామి అమ్మవార్లు



గరుడవాహనంపై శ్రీవారు

రాపూరు : పెంచలకోనలోని పెనుశిల శ్రీలక్ష్మీనరసింహస్వామివారు చందనాలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం స్వాతి నక్షత్రం శ్రీవారి జన్మనక్షత్రం కావడంతో మూల మూర్తిని చందనంతో అలంకరించారు. ఉదయం అభిషేకం, పుష్పాలంకరణ, శాంతి హోమం జరిపించారు. అనంతరం కనులపండువగా కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి శ్రీవారు తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనం అధిష్ఠించి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

23న ఒలింపిక్ రన్

తిరుపతి కల్చరల్ : జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీన ఒలింపిక్ రన్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ త్వరలో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. . అనంతరం 40 ఏళ్లుగా క్రీడలకు సేవలందిస్తున్న ప్రసన్నకుమార్‌ని పలు క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, కోశాధికారి సాయికుమార్, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, సహ కార్యదర్శి విజయ్‌కుమార్, రత్నాకర్, తైక్వాండో సంఘం నేత గోపీనాయుడు, బ్యాడ్మింటన్ సంఘం నేత శివయ్య, రాకెట్ బాల్ సంఘం నేత ప్రేమ్, రోయింగ్ సంఘం శ్రీధర్, రైఫిల్ రోయింగ్ సంఘం హిమత్ పాల్గొన్నారు.

టీటీడీ కాలేజీల్లో పేద విద్యార్థులకు దగా



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుపతి కల్చరల్ : టీటీడీ జూనియర్ కళాశాలల్లో పేద విద్యార్థులను దగా చేస్తున్నారని, ఈడబ్ల్యూఎస్ పేరుతో అగ్రవర్ణాల వారికి పెద్దపీట వేస్తున్నారని ఓబీసీ విద్యార్థుల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి నగరంలో టీటీడీ నిర్వహిస్తున్న ఎస్వీ జూనియర్ కళాశాల, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలో అడ్మిషన్‌కు పెద్దసంఖ్యలో బీసీ, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే ఈడబ్ల్యూఎస్ కింద తక్కువ మార్కులు వచ్చిన ఓసీ విద్యార్థులకు సీట్లు కేటాయించారని మండిపడ్డారు. ఎక్కువ మార్కులు సాధించిన పేద విద్యార్థులకు సీట్లు దక్కకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 330 మార్కులు సాధించిన ఓసీ విద్యార్థినికి పద్మావతి మహిళా కళాశాలలో సీటు లభించిందని, అయితే ఎస్టీ విద్యార్థినికి 530 మార్కులు వచ్చినా తిరస్కారమే ఎదురైందన్నారు. పేద విద్యార్థులకు అన్యాయం చేస్తున్న ఈడబ్ల్యూఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నేతలు విజయ్ ఉత్తరాది, వెంకటేష్, సంబరం పాల్గొన్నారు.

క్రేజ్ లేని పీజీ

- పోస్టు గ్రాడ్యుయేషన్‌పై విద్యార్థుల నిరాసక్తత
- గత ఏడాది కంటే 6 వేలు తక్కువగా దరఖాస్తులు
- భారీగా పడిపోతున్న సాధారణ డిగ్రీలో ప్రవేశాలు
- యూజీ పూర్తి చేసిన వెంటనే ఉపాధి వైపు చూస్తున్న యువత



రెండేళ్లు వచ్చిన దరఖాస్తుల వివరాలు

కోర్సులు	పీజీసెట్–2024	పీజీసెట్–2025
కెమికల్ సైన్స్	8,551	6,070
లైఫ్ సైన్స్	3,753	4,027
కంప్యూటర్	2,975	2,333
కామర్స్	2,215	1,438
ఇంగ్లిష్	1,127	898
హ్యుమానిటీస్	1,575	883
జువాలజీ	1,875	1,548
గణితం	2,200	1,175
ఫిజిక్స్	1,495	938
బోటనీ	1,370	1,295
మిగిలినవి	6,013	5,083

తిరుపతి సిటీ : పోస్ట్ గ్రాడ్యుయేట్ అంటే పెద్ద చదువుగా భావించేవారు. పీజీ చేసిన వ్యక్తికి సమాజంలో ప్రత్యేక గౌరవం ఉండేది. అత్యున్నత విద్యగా గుర్తింపు పొందిన పీజీకి ప్రస్తుతం ఆదరణ కరువవుతోంది. ఎంఏ, ఎమ్‌కాం, ఎమ్మెస్సీ తదితర కోర్సులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏటా తగ్గుముఖం పడుతున్నారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్, ఎంబీబీఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులపై మొగ్గు చూపుతున్నారు. దీంతో సాధారణ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయని అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే పీజీ కోర్సులకు ఆదరణ తగ్గుతోందని వెల్లడిస్తున్నారు.

తగ్గిన దరఖాస్తులు

గత ఏడాది పీజీ సెట్‌కు 32 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది 6 వేలు తగ్గడం గమనార్హం. 31 సబ్జెక్టులకు సంబంధించి పీజీలో సుమారు 25 వేల సీట్లు ఉండగా 25,688 దరఖాస్తులు రావడంతో పీజీ కోర్సులలో ప్రస్తుతం ఉన్న సీట్లకు అందిన దరఖాస్తులతో పోలిస్తే పోటీ 1:1గా ఉంటుందనడంలో సందేహంలేదు. ఈ ఏడాది పీజీకి దరఖాస్తు చేసుకుని అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి సీటు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఉపాధి వైపు యువత మొగ్గు



ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు మెడికల్, ఇంజినీరింగ్ కోర్సుల వైపు అధికంగా ఆసక్తి చూపుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం యూజీ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం వైపు ఎక్కువగా మొగ్గుతున్నారు.

– భూపతినాయుడు, రిజిస్ట్రార్, ఎస్వీయూ

డిగ్రీలో ప్రవేశాలు అంతంతే



ఇంటర్ పూర్తి చేసి సాధారణ డిగ్రీ పూర్తి చేస్తే ఉద్యోగాలు దొరకవనే అపోహ కారణంగా డిగ్రీలో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. దీంతో ఆ ఎఫెక్ట్ పీజీ కోర్సులపై పడుతోంది. ప్రస్తుతం డిగ్రీ కోర్సులలోనూ ప్రభుత్వం డబుల్ మేజర్ సబ్జెక్ట్‌తో పాటు ఏఐ, మిషన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి కోర్సులలో శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తోంది. ఎన్ఈపీతో డిగ్రీ స్థాయిలో విదార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారు.

– పీసీ వెంకటేశ్వర్లు, కన్వీనర్, పీజీ సెట్–2025

పీజీ కోర్సులతో ఉన్నత ఉద్యోగాలు



పీజీ కోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నత ఉద్యోగాలు సాధిస్తున్నారు. ఎన్ఈపీ ద్వారా విద్యారంగంలో పలు నూతన సంస్కరణలకు బీజం పడింది. ఉపాధి, ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పీజీ కోర్సులతో పాటు స్కిల్‌డెవలప్‌మెంట్ పెంపొందించుకోవాల్సిన అవసరముంది. డిగ్రీలో ప్రవేశాలు తగ్గడంతో పాటు డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగాల వైపు యువత వెళ్లడమే పీజీలో అడ్మిషన్లు తగ్గడానికి ప్రధాన కారణం.

– సీహెచ్ అప్పారావు, వీసీ, ఎస్వీయూ

ఆలోచించాల్సిందే..



డిగ్రీ పూర్తి చేసిన యువత ఉపాధి వైపు చూస్తున్నారు. పీజీ, పీహెచ్‌డీలపై అధునిక యువత ఉత్సాహం చూపకపోవడంపై ఆలోచించాల్సిందే. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థి తన లక్ష్యం మెడిసిన్, ఇంజినీరింగ్ అనే భావిస్తున్నారు. దీంతో సాధారణ డిగ్రీలో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. తల్లిదండ్రులు సైతం వారి ఆలోచనను ప్రోత్సహిస్తున్నారు. ఉన్నత విద్యే లక్ష్యంగా విద్యార్థుల అడుగులు పడాలి.

–సురేంద్రబాబు, ఎగ్జామినేషన్స్ డీన్, ఎస్వీయూ